# "రాజును గురించిన కథ"

అనగా అనగా అనగా ఒక రాజ్యంలో ఒక రాజు వుండేవాడు. అతను చాలా మంచివాడనీ, గొప్పవాడనీ ప్రతీతి. బావులు త్రవ్వించాడు, చెరువులు పోయించాడు, రోడ్డు వేయించాడు, బంగళాలు కట్టించాడు తోటలు వేయించాడు. ఇదంతా చూసి ప్రజలు చాలా ముచ్చటపడ్డారు. రాజుగారిని ఎంతో పొగిడారు. రాజుగారి రాజ్యమంతా ప్రశాంతంగా హాయిగా వుంటూ వచ్చింది.

ఇల్లా వుండగా వుండగా కొన్నాళ్ళకి రాజ్యంలో ఒక మూల కొంత అలజడి బయలుదేరింది. అది కాస్తా పెరిగి పెరిగి అల్లర్లలోకీ, దొంగతనాల్లోకీ, దోపిళ్ళలోకీ దిగింది. చిత్రమేమిటంటే ఈ దొంగతనాలూ, దోపిళ్ళూ అన్నీ రాజుగారికి ప్రియమైన సామంతుల ఇళ్ళల్లోనే జరుగుతూన్నాయి సామంతులంతా హడలెత్తిపోయారు. రెక్కలు కట్టుకు వెళ్ళి రాజుగారి ముందు వాలారు. మొరపెట్టుకున్నారు. రాజుగారికి ఆశ్చర్యం వేసింది. తన ప్రజల్లో, తన అమాయకపు ప్రజల్లో ఇల్లాంటి దుండగీళ్ళు వున్నారని అతను నమ్మలేక పోయాడు. వెంటనే తన గూఢ చార్లని పంపి సంగతి సందర్భాలు కనుక్కున్నాడు. నిజమే

సని తేలింది. రాజుగారి మనస్సుకు చాలా కష్టం కలిగింది. బాగా కోపం కూడా వచ్చేసింది. మంత్రిని పిలిపించాడు.

"ఏవిఁటోయ్ మంత్రీ! నువ్వేం చేస్తున్నావ్? ఈ అల్లర్లేవిఁటి?" అని అడిగాడు రాజుగారు.

"చిత్తం ప్రభూ! నేనూ విన్నాను. సరైన కట్టుదిట్టాలు చేయటానికి ఆలోచిస్తూనే వున్నాను," అన్నాడు మంత్రి చేతులు నలుపుకుంటూ.

"ఇంకా ఆలోచిస్తూనే వున్నావ్? నీ వెధవ ఆలోచనలూ నువ్వూనూ! నా కెంత అప్రతిష్ఠో తెలుసా?"

"చిత్తం. చిత్తం. ఏలినవారు కాస్త వ్యవధి ఇస్తే చిటికెలో అణచేస్తాను ఇదంతా".

"ఆ చేసేదేదో త్వరగా చెయ్యి. నేనాట్టే సహించలేను," అంటూ గిరుక్కున తిరిగి రాణివాసంలోకి వెళ్ళిపోయాడు రాజుగారు.

కొన్నాళ్లు గడిచాయి. రాజుగారు ఈవిషయం దాదాపు మరిచిపొయ్యారు. కాని ఒక రోజు మళ్ళీ వచ్చిపడ్డారు సామంతులంతా. ఈసారి గోడుగోడున ఏడ్వడం మొదలుపెట్టారు.

"ఏవిఁటి ఇంకా అల్లర్లు తగ్గలేదా?" అని అడిగారు రాజుగారు.

"తగటమేవిఁటి, ఇంకా బాగా హెచ్చయితే— మా కక్కడ నిలువ నీడ లేకపోతోంది. మేమిక ఈ రాజధాని వదలిపోతాం," అన్నారు.

రాజుగారికి అరికాలిమంట నెత్తికెక్కింది. వెంటనే మంత్రిని పటి తెప్పించాడు. నానా చీవాట్లు పెట్టాడు. అంతా విని చేతులు జోడించి సవినయంగా అన్నాడు మంత్రి, "ఏలినవారు సెలవిస్తే మనవి చేసుకుంటాను," అని.

"ఏమిటో ఏడువ్," అన్నాడు రాజుగారు కోపంగా.

"మీ ఆజ్ఞానుసారం సామ భేద దండోపాయాలన్నీ ప్రయోగించాను, ఈ దుండగులపైన. కాని లాభం లేకండా పోతోంది. ఎందర్నో చెరసాల్లో వేయించాను, ఎందర్నో కొట్టించాను, ఎందర్నో ఉరి తీయించాను అయినా అల్లర్లు తగ్గటంలేదు..."

"అంటే నువ్వు వట్టి వాజమ్మవని చెబుతున్నావా ?"

"చిత్తం. నేను మీలాగానే పుణ్యకాలం పురుషుణ్ణి. ఆ మంచి కాలంలో మంత్రిత్వం చెలాయించగలిగాను, కాని ఈ అధర్మపు రోజుల్లో నా మంచితనం నెగ్గలేకపోతోంది. పూర్వం దొంగతనాలూ, దోపిళ్ళూ అయ్యేవీ అంటే, ఏ అర్ధరాత్రో ఎవరికంటా పడకండా వాళ్ళకు తోచింది వాళ్ళు పాపం చడీచప్పుడు లేకండా పట్టుకెళ్ళేవారు. కాని ఇలా మతాలు ముఠాలుగా వచ్చి పట్టపగలే దోపిళ్ళుచేసి, హత్యలు చేయటమే కాకుండా మన రక్షక భటుల్నీ, సైనికుల్ని ఎదిరించి పోరాడటం నేను కనీ వినీ ఎరుగను."

రాజుగారికి చిరాకెత్తిపోయింది. "ఇంతకూ ఏమంటావ్ !" అని గర్జించాడు.

"చిత్తం అదే మనవి చేసుకుంటున్నాను. ఒక వుపాయం..."

"ఏమిటది ?"

"దొంగను దొంగే పట్టాలి".

"అంటే ?"

"ఈ దుండగీళ్ళల్లోంచే ఒకణ్ణి మంచివాణ్ణి చూసి, చేరదీసి మంచి చేసుకుని వాడిచేత తక్కినవాళ్ళని పట్టించాలి."

"ఏడిసినట్టేవుందీసలహా. దొంగలకు రాజ్యం కట్టమంటావ్ ?"

"అన్నన్న ఎంతమాట! మీరు మీ సింహాసనం పైనే వుంటారు. నేనూ తెర వెనకాలే వుంటాను. పోతే, ఈ మంత్రిత్వం వాడి మొహాన కొడితే వాడి తంటాలు వాడు పడతాడు. మన కష్టాలూ తప్పుతై. హాయిగా బతకొచ్చు... ఏమంటారు?" అన్నాడు మంత్రి.

రాజుగారికి ఎటూ పాలుపోలా. బోనులో చిక్కిన ఎలుకను మల్లే అతని హృదయం తన్నుకో సాగింది. ఎంత ఆలోచించినా ఏమీ తోచలా. ఆఖరికి అంధకారంలో ఆశాజ్యోతిలా ఆ సలహా ఒక్కటే కనిపించి వొప్పుకోక తప్పింది కాదు రాజుగారికి.

"మరి అల్లాంటి నమ్మదగ్గవాడు ఎవడేనా వున్నాడా ?" అని అడిగాడు.

"చిత్తం. ఒకడున్నాడు. మీ ఆజ్ఞఅయితే రేపు మీపాదాల పైన తెచ్చి పడేస్తాను."

"సరే" నని దిగాలుగా లోపలికి వెళ్ళిపోయాడు రాజుగారు.

రెండోరోజు మంత్రి ఓ కొత్త మనిషిని వెంటబెట్టుకొచ్చాడు.

రాజుగారు అతణ్ణి ఎగాదిగా చూశాడు. మనిషి కాస్త లావుగా బొద్దుగా వుంటాడు. తెల్లని దుస్తులు వేసుకున్నాడు. తెల్ల టోపీ పెట్టుకున్నాడు. దుండగీళ్ళ లక్షణాలు అట్టేలేవు. పూర్తిగా 'మనవాడు' కాకపోయినా నమ్మదగ్గమనిషే ననిపించింది రాజుగారికి

ఆ తర్వాత మూడు గంటలు ముచ్చటించారు ముగ్గురూ కలిసి. "మంత్రిత్వం ఇస్తాం. రాజభవనమిస్తాం, గొప్ప జీతమిస్తాం. రాజ్యభార మంతా నీదే. కేవలం మా స్వంత ఖజానాకు వచ్చే ఆదాయం మాత్రం తప్పకుండా వచ్చేట్టు చూడాలి. అంతే." అని ఊరించారు రాజుగారు.

ఇవేవీ కలలో, ఇలలో కూడా అనుభవించని ఆ ఆగంతకుడు ఉబ్బి తబ్బిబ్బై ఏ వొప్పేసుకున్నాడు. కొత్త మంత్రిపదవి స్వీకారం జరిగింది.

ఇకనేం. తాను నిశ్చింతగా నిద్రపోవచ్చనుకున్నాడు రాజుగారు;

నిజంగానే కొద్దిరోజులపాటు హాయిగా నిద్రపోయారు కూడాను రాజుగారు. కాని ఒకరోజు అర్ధరాత్రి హఠాత్తుగా మెలకువొచ్చింది. ఏదో అలజడి వినిపించింది, సమీపంలోనే. ఇన్నాళ్లు రాజధానికి దూరాన ఎక్కడో కొన్ని ప్రదేశాలలో అల్లర్లు అవుతూన్నయని వినికిడే కాని రాజుగారు స్వయంగా, అదీ తన కోటకు అంత సమీపంలో వినటం అదే మొదటిసారి. గాబరాపడి లేచి కూచున్నారు. కొత్తమంత్రికి కబురు చేశాడు. కొత్తమంత్రి పరుగెత్తుకొచ్చి చేతులు జోడించి నిలుచున్నాడు.

"ఏవిటీఅల్లరి ?" అని అడిగాడు రాజుగారు.

"చిత్తం. ప్రభువులకు శుభవార్త" అన్నాడు ముసిముసి నవ్వులతో కొత్తమంత్రి.

"శుభవార్తా ?" రాజుగారికి ఆశ్చర్యమేసింది.

"చిత్తం. దుండగీళ్ళలోంచి అసలైన నలుగురు నాయకుల్ని పట్టి తెప్పించాను. అది విని వాళ్ళ అనుచరులు కొందరు అల్లరిచేస్తున్నారు. కాని అదెంత లెండి..."

"నిజంగానే ?" రాజుగారు సంతోషం పట్టలేకపోయారు. అమాంతంగా కొత్తమంత్రిని కౌగలించుకున్నాడు, కొత్తమంత్రి ఆనందానికి మేరలేదు.

"అయితే నేను వాళ్ళని చూడొద్దూ ?" అన్నాడు రాజుగారు.

"ఇప్పుడు మీకు శ్రమెందుకు లెండి. విశ్రాంతి తీసుకోండి. ఆజ్ఞ అయితే రేపొద్దున్నే..."

"సరే," అన్నాడు రాజుగారు.

రాజుగారికి ఆ రాత్రల్లా నిద్ర పట్టనేలేదు. ప్రొద్దునే మంత్రికి కబురంపాడు. కొత్తమంత్రి నలుగురు నాయకులతో హాజరైనాడు.

కాని వాళ్ళని చూసేసరికి రాజుగారి ఉత్సాహమంతా ఒక్కసారి చప్పబడ్డది. దొంగలూ .దోపిడిగాళ్ళంటే తను చదివిన పుస్తకాలలోవలె రాక్షసుల్లా భయంకర వికృతాకారాలతో వుంటారనుకున్నాడే గాని ఇల్లా బక్కచిక్కి, బొమికలు తేలి, ఈడ్చుకుపోయిన కళ్ళూ, పొట్టా, మాసిన జుత్తూ, గడ్డంతో వుటారని రాజుగారు కలలో కూడా అనుకోలేదు. భయంకరాకారాలు కాకపోయినా కనీసం కొత్తమంత్రిలా లావుగానైనా లేవు. తాను వూహించుకున్న గుండా లక్షణాలు వీళ్ళల్లో ఏకోశానాలేవు. నిరుత్సాహం కలిగింది రాజుగారికి.

"ఏమిటోయ్ మంత్రీ! నీకేమైనా మతి పోయిందేమిటి. నాయకులంటూ ఎక్కడో బికారీగాళ్ళని పట్టుకొచ్చావేం" అన్నాడు రాజుగారు.

"లేదు ప్రభూ! వీళ్ళే సిసలైన నాయకులు. వీళ్ళ ప్రోత్సాహంతోనే..." అంటూ సంజాయిషీ యిచ్చుకోబోయాడు కొత్తమంత్రి.

"ఛీ, ఛీ! వీళ్ళేం నాయకులోయ్ నీ పిచ్చిగాని" అంటూ వాళ్ళల్లో ఒకడివేపు, తిరిగి "ఎవరోయ్ నువ్వూ?"అని అడిగాడు రాజుగారు.

"నేను కథకుణ్ణి" ఠంగున జవాబొచ్చింది.

"కథకుడూ...? ...అంటే?" అంతు చిక్కలా.

"నేను కథలు చెబుతాను".

రాజుగారికి ఒక్కసారి నవ్వు పుట్టుకొచ్చింది.

"భలే! భలే! మంచి నాయకుడివే దొరికావోయ్! ఏదీ కథ చెప్పు విందాం. నాకూ కథలంటే మహా చెడ్డపిచ్చిసుమా," అన్నాడు రాజుగారు హాస్యానికి దిగుతూ.

కథకుడు కథ మొదలెట్టాడు :

"అనగా అనగా ఒకచోట ఒక చీమలపుట్ట వుండేది..."

"చీమలపుట్టా?... ఇదేంకథ?" అన్నాడు రాజుగారు మొహం చిట్లించుకుంటూ.

"అల్లాగే వుంటుంది" అన్నాడు, కథకుడు నిర్లక్ష్యంగా.

క్షణం సేపు ఆగి రాజుగారు, "సరే, కానీ" అన్నాడు.

"ఆ చీమల పుటలో అనేకం చీమలుండేవి. చిన్నవీ పెద్దవీ, ముసలివీ అన్నీని. అవన్నీ రాత్రినకా, పగలనకా, ఎండనకా, వాననకా, చలనకా ఎప్పుడూ హడావిడిగా అటూ ఇటూ తిరుగుతూ పుట్టని పెంచటంలోనూ, ఆహారం సంపాదించి సమకూర్చటంలోనూ నిమగ్నమై వుండేవి. వాటిలో ఒకటి కూడా సోమరితనంగా పనిచేయక కూచునేది కాదు — ఒక్క చీమల రాణి తప్ప. చీమల రాణి అసలు ఏ పనీ చేసేది కాదు. తక్కిన చీమలు తెచ్చిన ఆహారాన్ని మెక్కుతూ బాగా బలిసి తక్కినవాటికంటే ఎన్నో ఇంతలు లావెక్కి కూచుంది. చీమల రాణి చేసే పనల్లా పిల్లల్ని కనటం, తక్కిన చీమలపైన అధికారం చలాయించటం, అంతే... ఇల్లా వుండగా, వుండగా ఒకసారి కొన్ని చిన్నచిన్న చీమల పైన పుట్టవెలుపలి విప్లవగాలి కాస్త సోకింది. వాటి చిన్నచిన్న బుర్రల్లో చిన్నచిన్న వింత వూహలు బయలుదేరాయి. 'దీని తస్సాదియ్యా, ఈ రాణిముండ మమ్మల్ని వేపుకు తింటోంది. మా

రెక్కలకష్టం తాను కాజేస్తూ పైగా మమ్మల్నే దబాయిస్తుంది. దీని పని పట్టాలి' అని అనుకున్నాయి..."

"ఛీ ! ఛీ ! ఇదేం పాడుకథ" రాజుగారు అడ్డుతగిలారు. "అందమైన రాకుమార్తెలు లేరు, రాజకుమారుల్లేరు, వుద్యానవనాల్లేవు, గుఱ్ఱపుస్వారీ లేదు ఇదేం వెధవకథ" అన్నాడు.

"నా కల్లాంటి కథలే వస్తాయి" అన్నాడు కథకుడు,

"సర్లే నాకఖ్ఖర్లేదు — మరి నువ్వోయ్ ?" అన్నాడు రాజుగారు రెండోవాడివైపు తిరుగుతూ.

"నేను కవిని".

"కవివా !... భలే ! ఏదీ నామీద వాహ పద్యంరాయి చూద్దాం నా ఆస్థానకవిని చేసేస్తాను."

"నేను మనుష్యులపైన రాయను, మావాడు చెప్పే కథల సారాంశాన్ని నేను గేయాలుగా అల్లుతాను."

"సరే, అల్లుకో... మరి నువ్వూ ?" అడిగాడు రాజుగారు మూడోవాడి నుద్దేశించి.

"నేను గాయకుణ్ణి".

"భలే ! భలే ! ఏదీ ఒక చక్కని రాగాన్ని ఆలాపించు".

"ఉహుఁ. నేను రాగాలాపన చెయ్యను. మావాడు రాసే గేయాల్ని పాడుతాను".

"నువ్వేవిఁటోయ్ ?" అడిగాడు రాజుగారు నాలుగోవాణ్ణి.

"నేను చిత్రకారుణ్ణి".

"అహో_ చిత్రాలు గీస్తావుటోయ్. ఏదీ నా చిత్రమొహటి మంచిది గియ్".

"ఉహుఁ. ఒకళ్ళ చిత్రాలు గియ్యను నేను, మావాడు పాడే గేయాల్ని మాత్రం చిత్రిస్తాను".

"సరే నలుగురూ కలిసి కట్టగట్టుకు గంగలో దిగండి," అన్నాడు రాజుగారు కోపంగా. "ఒరే దర్బాన్! వీళ్ళని తన్ని బయటికి గెంటించు".

కొత్తమంత్రికి చురుకు పుట్టింది. ప్రభూ! ప్రభూ! ఇదేం చేస్తున్నారు! వాళ్ళని వదిలిపెట్టొద్దు. వాళ్ల అసాధ్యులు. ఈ అల్లర్లకంతా మూలకారకులు వాళ్లే..." అన్నాడు ఆదుర్దాగా.

"చష్. వూర్కో. అట్టె వాగావంటే నిన్ను పిచ్చాసుపత్రికి పంపిస్తాను జాగ్రత్త" అని గదమాయించాడు రాజుగారు.

చేసేదిలేక తోక ముడిచాడు కొత్తమంత్రి.

ఆ తర్వాత ఆ రాజు విషయంగానీ, ఆ రాజ్యం విషయంగానీ ఏమీ తెలియనే లేదు. కాని ఇప్పుడక్కడ రాజూలేడు, రాజ్యమూలేదు, కేవలం దొంగలూ దొంగల నాయకులు మాత్రం మిగిలారట. కథ కంచికి మనం ఇంటికి.